క్లుప్తంగా

రేపు జిల్లాస్థాయి గాలి పటాల పోటీలు

మునగపాక: భోగీ పండగ సందర్భంగా ఈ నెల 14న జిల్లాస్థాయి గాలిపటాల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మునగపాక సంతబయలు యూత్ ఆధ్వర్యంలో స్థానిక బైపాస్‌ను అనుకొని మధ్యాహ్నం 2 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి. ఎంట్రీ ఫీజుగా రూ.20 చెల్లించాల్సి ఉంది. మొదటి బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3వేలు,తృతీయ బహుమతిగా రూ.2వేలు,చతుర్ద బహుమతిగా రూ.1500 అందజేస్తారు. ఆసక్తి కలవారు 9642966222, 9248589964 అనే పోన్ నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

ఉత్సాహంగా మేలుకొలుపులు



నాగులాపల్లిలో భజన చేస్తున్న భక్తులు

మునగపాక: మండల వ్యాప్తంగా మేలుకొలుపుల కార్యక్రమం కొనసాగుతోంది. ధనుర్మాసం ప్రారంభం నుంచి భోగి పండగ వరకు గ్రామాల్లో మేలుకొలుపులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. తెల్లవారు నుంచే భక్తులు మేల్కొని భజనలు చేస్తూ మేలు కొలుపుల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

కాలినడకన సింహాచలానికి..



ఇరుముడులతో సింహాద్రప్పన్న దర్శనానికి వెళుతున్న భక్తులు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లికి చెందిన పలువురు సింహాద్రప్పన్న భక్తులు శుక్రవారం ఇరుముడులు ధరించి సింహాచలంలోని నరసింహస్వామి దర్శనానికి పయనమయ్యారు. తాము చేపట్టిన దీక్ష పూర్తి కావడంతో నరసింహస్వామిని దర్శించుకునేందుకు కాలినడకన బయలు దేరారు.యాత్రను సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ప్రారంభించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు, ఇతర సామగ్రిని పంపిణీ చేస్తున్న ఉష శ్రీ ప్రసాద్, జగతా భవానీ

పాయకరావుపేట: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ గారా ఉష శ్రీ ప్రసాద్, ఉపసర్పంచ్ జగతా భవానీ దుస్తులు, సబ్బులు, చెప్పులు, కొబ్బరి నూనె తదితర సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జె.చంద్రశేఖర్, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేలో లోపాలను సరి చేయాలి



మాట్లాడుతున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక: అధికారుల నిర్లక్ష్యం కారణంగా రీ సర్వేలో పలు లోపాలున్నాయని వాటిని సరి చేసి, రైతులకు మేలు జరిగేలా చూడాలని సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతూ రైతులకు సేవలందించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. గ్రామాభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా సహకరించాలని కోరారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, సచివాలయాల మండల కన్వీనర్ పాలిమేర గణేష్, ఎంపీటీసీ బోడకుర్తి గణేష్, సచివాలయాల కన్వీనర్లు టిక్కలి కొండలరావు, బొడ్డేడ మహేష్, వార్డు సభ్యులు వేగి కృష్ణవేణి, బలిరెడ్డి సూరప్పారావు, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా 'ఆడుదాం ఆంధ్రా'



షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు



షటిల్ ఆడుతున్న క్రీడాకారులు



తిమ్మాపురంలో కబడ్డీలో తలపడుతున్న జట్లు

ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ విజయం సాధించేందుకు చెమటోడుస్తున్నారు. ఉత్సాహభరితంగా సాగుతున్న పోటీలను తిలకించేందుకు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు.

ఎస్.రాయవరం: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు మూడవ రోజు శుక్రవారం ఉత్సాహ భరితంగా సాగాయి. తిమ్మాపురం వేదికగా వేద కోచింగ్ కేంద్రం ఆవరణలో కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పలు గ్రామాలనుంచి వచ్చిన క్రీడాకారుల మధ్య పోటీలు ఆసక్తికరంగా సాగాయి. గెలుపొందిన జట్లు నియోజకవర్గ స్థాయిలో తలపడతాయని ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు.

అచ్యుతాపురం: మండలంలో ఆడుదాం ఆంధ్రా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన షటిల్ బ్యాండ్మింటన్ పోటీల్లో ఉప్పవరానికి చెందిన సురేంద్ర, త్రిలోక వర్మ జట్టుకు ప్రథమ స్థానం, దుప్పుతూరుకు చెందిన కె.వెంకటనాయుడు,పవన్‌విజయ్‌కుమార్ జట్టుకు ద్వితీయ స్థానం లభించాయి. ఖోఖో పోటీల్లో హరిపాలెంకు ప్రథమ స్థానం, ఖాజీపాలెంకు ద్వితీయ స్థానం లభించాయి. బాలికల విభాగంలో కొండకర్ల జట్టుకు ప్రథమ స్థానం,పూడిమడక-2 జట్టుకు ద్వితీయ స్థానం లభించాయి.

ఉత్సాహంగా క్రీడాపోటీలు

మునగపాక: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా శుక్రవారం షటిల్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మండల స్థాయి షటిల్ పోటీలు మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్,పాటిపల్లి సచివాలయ ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా జగన్ పాలన



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు కంబాల జోగులు, గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం: విజయవాడలో ఈ నెల19న నిర్వహించే బి.ఆర్.అంబేద్కర్ భారీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని వైఎస్సార్ సీపీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్యే గొల్ల బాబూరావులు పిలుపునిచ్చారు. అడ్డురోడ్డులో కంబాల జోగులు క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గ నాయకులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రభుత్వం రూ.404 కోట్లతో భారత్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసిందన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయంతో రాజ్యాంగబద్ధమైన సంక్షేమ పాలన అందిస్తున్నారని చెప్పారు. ఈ విగ్రహం ఏర్పాటుకు సుమారు 17 ఎకరాలను కేటాయించారన్నారు. ఈప్రాంతంలో స్మృతివనంతో పాటు డిజటల్ లైబ్రరీ, మ్యూజియం తదితరాలు ఏర్పాటు చేసి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తారన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహావిష్కరణ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.రాయవరం ఎంపీపీ కోన లోవలక్ష్మి, నక్కపల్లి జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాల అధ్యక్షులు బొలిశెట్టి గోవిందరావు, చిక్కాల రామారావు, బీసీ సెల్ అధ్యక్షుడు పైలా రమేష్, మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు మాతా గురునాథరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ధనిశెట్టి బాబూరావు, శ్రీపతిరాజు, గొర్ల బాబూరావు, పలుగ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'డి పట్టా ఆన్‌లైన్ చేసేందుకు ఇబ్బంది పెడుతున్నారు'



డీటీ సోమశేఖర్‌కు సమస్యను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, బాధితులు

కోటవురట్ల: ప్రభుత్వం ఇచ్చిన డి పట్టా భూమిని ఆన్‌లైన్ చేసేందుకు రెవెన్యూ అధికారులు ఇబ్బంది పెడుతున్నారని లబ్ధిదారు పెట్ల లోవలక్ష్మి ఆరోపించారు. తహసీల్దారు కార్యాలయంలో లోవలక్ష్మి వీఆర్వో ఆశాను శుక్రవారం నిలదీశారు. లోవలక్ష్మి మాట్లాడుతూ తనకు 1988లో పందూరు రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 431/10లో 1.87 సెంట్లు డి పట్టా భూమిని ప్రభుత్వం ఇచ్చిందని, అందులో జీడిమొక్కలు వేసి దానిపై వచ్చే ఫలసాయంతో బతుకుతున్నామని తెలిపారు. అయితే రైతు భరోసా నిధులు పడకపోవడంతో ఆన్‌లైన్ చేయాలని వీఆర్వో ఆశాను కోరగా సర్వే చేసి కూడా దానిపై ఫిర్యాదు ఉందనే నెపంతో ఆన్‌లైన్ చేయలేదని ఆరోపించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు కార్యాలయానికి చేరుకుని డీటీ సోమశేఖర్‌తో మాట్లాడుతూ సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై విచారణ చేసి పరిష్కరిస్తామని డీటీ సోమశేఖర్ తెలిపారు. మాజీ సర్పంచ్ టి.నారాయణరావు, రైతులు ఉన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి



మెమొంటోను అందజేస్తున్న కల్యాణి, శ్రీరామ్మూర్తి

రాంబిల్లి: సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకునేందుకు అందరూ కృషి చేయాలని భగవత్ భక్తి ప్రచార ట్రస్టు ప్రతినిధులు భాగవతుల కల్యాణి, శ్రీరామ్మూర్తి అన్నారు. సంక్రాంతి సంబరాలు పేరిట గ్రామాల్లో మేలుకొలుపులు, నగర సంకీర్తన నిర్వహించిన కమిటీలకు శుక్రవారం భగవత్ భక్తి ప్రచార ట్రస్టు తరపున బహుమతులు, మెమొంటోలను వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే సీనియర్ శాస్త్రవేత్త శైలజ, బీసీటీ ప్రతినిధి సీతారామరాజు, సామాజిక విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన



వైద్య సేవలందిస్తున్న తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్

కశింకోట : మండలంలోని తీడ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష ఆదరణ లభించింది. 212 మందికి సేవలందించారు. ఎంపీపీ కలగా లక్ష్మి శిబిరాన్ని సందర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగ గున్నయ్యనాయుడు, సర్పంచ్ చిరికి సత్యనారాయణ, స్త్రీ వైద్య నిపుణురాలు విష్ణుప్రియ, కీళ్ల వైద్య నిపుణుడు ఎస్. గోపి, తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యుడు ఎన్. రమేష్, ఆప్తాలమిక్ సంధ్య హాజరై పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కంటి శస్త్ర చికిత్సలు, కళ్లద్దాల కోసం సిఫార్సు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సచివాలయం పరిధిలోని తీడ, చెరకాం గ్రామాల నుంచి గర్భిణులు, వికలాంగులు, పిల్లలు హాజరయ్యారు. ఎంపీహెచ్‌ఈవో సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది సేవలందించారు.

ఓటు హక్కే వజ్రాయుధం



ముగ్గులను పరిశీలిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లి : ఓటు హక్కు వజ్రాయుధమని ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ అన్నారు. పట్టణంలో జీవీఎంసీ గవరపాలెం చిన హైస్కూల్లో శుక్రవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళలకు నియోజకవర్గ స్థాయి రంగవల్లుల పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈనెల 31వ తేదీ వరకు పలుచోట్ల ఓటుహక్కుపై కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈపోటీల్లో ప్రథమస్థానాన్ని తుమ్మపాలకు చెందిన మాదేటి తనుశ్రీ దక్కించుకోగా, ద్వితీయ స్థానాన్ని కశింకోట బీఎల్వోలు, తృతీయ స్థానం గవరపాలేనికి చెందిన గోదాల లక్ష్మి దక్కించుకున్నారు. విజేతలకు ఆయన బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధర్‌రావు, ఆర్‌ఐ రమేష్, వెలుగు ఏపీఎం సింహాచలం, అంగన్‌వాడీ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి శశికళ, ఎంఈవో-1 చిట్టిబాబు, జీవీఎంసీ ఏపీడీ వీకే దొర, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మేలుజాతి పశువులతో అధిక పాల దిగుబడి

- విశాఖ డెయిరీ డైరెక్టర్ రమాకుమారి



మాట్లాడుతున్న పిళ్లా రమాకుమారి

మాడుగుల రూరల్: మేలుజాతి పశువుల పెంపకంతో అధిక పాల దిగుబడి సాధించవచ్చునని విశాఖ డెయిరీ డైరెక్టర్, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. కె.జె.పురం పాల సొసైటీ ఆవరణలో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి రైతులకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, ఏడాదికి ఐదు వేల లీటర్ల పాలు పోసే రైతులకు పశువుల షెడ్డుల నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ముందుగా డెయిరీ మాజీ చైర్మన్ దివంగత ఆడారి తులసీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాల సొసైటీ అధ్యక్షుడు యల్లపు వెంకట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో డెయిరీ డైరెక్టరు శీరంరెడ్డి సూర్యనారాయణ, సర్పంచ్ జామి రమణబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కాళ్ల రాము, ఏఎంసీ డైరెక్టర్ బీశెట్టి జగ్గప్పారావు, మాజీ అధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు, మళ్ల కన్నబాబు, కాళ్ల అమ్మతల్లినాయుడు, డెయిరీ ఏరియా మేనేజర్ గుల్లిపల్లి రాము, సూపర్‌వైజర్ రాపేట సన్యాసిరావు, పాల సొసైటీ కార్యదర్శి బొడ్డేడ ప్రసాదు, ఏపీజీవీబీ మేనేజర్ సాయి సుధాకర్, సిబ్బంది బి. జగ్గారావు, తనకాల అప్పారావు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ధనుర్మాసోత్సవాలు

కశింకోట : మండల కేంద్రం కశింకోటలోని రెండు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ధనుర్మాసోత్సవాలు తుది దశకు చేరుకున్నాయి. విష్ణుమూర్తి దశావతారాల్లో చివరిది అయిన కల్కి అవతారంలో స్వామి భక్తులకు శుక్రవారం దర్శనం ఇచ్చారు. స్థానిక వేంకటేశ్వర స్వామి ధ్యాన మందిరం, గవరపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో స్వామి వారిని కల్కి అవతారంలో పూలమాలలు, ఆభరణాలతో అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన, పాశుర విన్నపం, తిరుప్పావై పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆయా ఆలయాల అర్చకులు రేజేటి రామచరణాచార్యులు, సుబ్రహ్మణ్యం, గవరపేట వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు బీశెట్టి దుర్గానాగేశ్వరరావు పాల్గొన్నారు.

వివేకానందుని జీవితం యువతకు ఆదర్శం



వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంఈవో



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు



తోటాడ హైస్కూల్‌లో వివేకానందుని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు



పెట్టుగోళ్లపల్లిలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నక్కపల్లి: వివేకానందుని జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈవో కుంచం నరేష్ అన్నారు. వివేకానందుని జయంతిని పురస్కరించుకుని స్థానిక ఎంఆర్‌సీ సెంటరులో శుక్రవారం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ వికేకానందుడి జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకొంటున్నట్టు చెప్పారు. ఉపాధ్యాయుడు ఆచార్యులు మాట్లాడుతూ పాశ్చాత్య దేశాలకు యోగా, వేదాంత శాస్త్రాలను తన ఉపన్యాసాలు, వాదనల ద్వారా పరిచయం చేసిన యోగి వివేకానందుడన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్. ఆచార్యులు, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూడిమడకలో...

అచ్యుతాపురం: మండలంలోని పూడిమడకలో శుక్రవారం స్వామి వివేకానందకు ఘనంగా నివాళులర్పించారు. శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా యూత్ ఆర్గనైజర్స్ అధ్యక్షుడు చోడపల్లి అప్పారావు, కార్యదర్శి మేరుగు అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివేకానంద విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం వృద్ధులు,వితంతువులు,దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు.విద్యార్థులకు బ్యాగులు అందజేశారు. మేరుగు రవి ప్రసాద్, దాసరి శ్రీను, మేరుగు బాపునాయుడు, చేపల కృష్ణ, మేరుగు అప్పలరాజు, మేరుగు నూకయ్య, సత్తాడ బాబూరావు, కొవిరి అప్పలరాజు పాల్గొన్నారు.

తోటాడలో..

మునగపాక: మండలంలోని తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం స్వామి వివేకానందుని జయంతి నిర్వహించారు. ఇదే స్కూల్‌లో 1992-93లో పదవతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో వివేకానందుని విగ్రహం వద్ద నివాళులర్పించారు. వివేకానందుని ఆశయ సాధనకు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల నాగేశ్వరరావు, అంగులూరి రామకృష్ణ, వీరప్పారావు, శంకర్, జగన్నాథం, నాగమణి, వసంత, జగదీశ్వరి, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

ఎస్.రాయవరం: నేటి యువతకు వివేకానందుని మార్గదర్శకాలు చాలా అవసరమని మెరైన్ సీఐ నారీమణి అన్నారు.వివేకానందుని జయంతి సందర్భంగా రేవుపోలవరంలో బీచ్‌గట్టున ఉన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రమణ, ఆంధ్రామత్స్యకార జేఏసీ అధ్యక్షుడు కంబాల అమ్మోరియా పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

పెట్టుగోళ్లపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వియ్యపు వరహాలరావు ఆధ్వర్యంలో వివేకానందుని జయంతి నిర్వహించారు.గ్రామ ముఖద్వారం వద్ద ఉన్న వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వరహాల రావు సమకూర్చిన దుప్పట్లు ,బియ్యం పంపిణీ చేశారు. అమ్మాజీ, పాఠశాల కమిటీ చైర్మన్ ఏసుబాబు, వైస్ చైర్మన్‌రాజేష్, చిన్న రమణ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ధనుర్మాసోత్సవాలు



కైలాసపట్నంలోని రాజగోపాలస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కోటవురట్ల: మండలంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కైలాసపట్నంలోని రాజగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని పూలతో అలంకరించి విష్ణుసహస్రనామార్చన చేశారు. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

తపాలా పథకాలపై ప్రచారం



రజాల సర్పంచ్ వరలక్ష్మికి కరపత్రం అందజేస్తున్న మురకాడ పోస్టుమెన్ రెడ్డి

రాంబిల్లి: తపాలా శాఖ పథకాలపై సర్పంచ్‌ల ద్వారా గ్రామాల్లో ప్రచారం చేపట్టేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు పోస్టుమాస్టర్లు, పోస్టుమెన్లు సర్పంచ్‌లను కలిసి కరపత్రాలు అందజేస్తున్నారు. తమకు సహకరించాలని కోరుతున్నారు. రజాల సర్పంచ్ వరలక్ష్మిని మురకాడ పోస్టుమెన్ రెడ్డి కలిసి కరపత్రాలు అందజేశారు.

20న గౌరీపరమేశ్వరుల మహోత్సవం



అమ్మవారి ఉత్సవ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లి : సుమారు 170 సంవత్సరాల చరిత్ర కలిగిన గౌరీ పరమేశ్వరుల మహోత్సవాన్ని ఈనెల 20వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తునట్లు ఆలయ అధ్యక్షుడు వాకాడ బాబు తెలిపారు. సీతారామ కల్యాణ మండపంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. అనంతరం మహోత్సవ గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి మద్దాల నూకరాజు, ఉపాధ్యక్షుడు శీరంశెట్టి నర్సింగరావు, సహాయ కార్యదర్శి పనసా శ్రీకాంత్, కోశాధికారి వేల్పుల గణేష్, ఆలయ పెద్దలు దోమరౌతు రామారావు, మద్దాల కూర్మారావు, ముత్తా ఈశ్వరరావు, మద్దాల రమణబాబు, గుమ్మాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబికకు ప్రత్యేక పూజలు



నూకాంబిక అమ్మవారి ఆలయంలో హోమం చేస్తున్న ఆలయ అర్చకులు

అనకాపల్లి : స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో ఆదిబాబు అమావాస్య యూత్, కంభంపాటి భాను కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు యనమండ్ర శ్రీనివాస్, సందీప్ శర్మ అమ్మవారికి పాలు, పసుపు, కుంకుమ, పళ్లరసాలు, గంధంతో శుక్రవారం అభిషేకాలు, హోమం నిర్వహించారు. అంతకు ముందు అమ్మవారికి పులిహోర, చక్రపొంగలి, అరిసెలు, పెరుగు గారెలు నైవేద్యంగా సమర్పించి, భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఖండివరంలో వ్యవసాయ స్టాళ్ల ప్రదర్శన



స్టాళ్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చీడికాడ: కృషి విజ్ఞాన కేంద్రం (కొండెంపూడి) ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల(నైరా), కింజారపు ఎర్రంనాయుడు వ్యవసాయ కళాశాల(ఎచ్చెర్ల) సంయుక్తంగా శుక్రవారం ఖండివరంలో రైతు సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం ఎ.డి.ఆర్ డాక్టర్ పి.వి.కె. జగన్నాథరావు, నైరా కళాశాల అసోసియేషన్ డీన్ జి. జోగినాయుడు, కె. మహేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వ్యవసాయ నమూనాలను పరిశీలించారు. చోడవరం డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ రవీంద్రనాథ్, ఎంపీపీ కురచా జయమ్మ, సర్పంచ్ శీరంరెడ్డి లక్ష్మి, కె.వి.కె శాస్త్రవేత్త రాజ్‌కుమార్, ఎన్. కిశోర్ కుమార్, సత్తిబాబు, సౌజన్య, స్రవంతి, రాము నాయుడు, రాజేష్ పాల్గొన్నారు.

ఫిబ్రవరి 29లోగా లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

తుమ్మపాల : ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల జీవన ధ్రువీకరణ పత్రాలు (లైఫ్ సర్టిఫికెట్స్)ను ఫిబ్రవరి 29లోగా సమర్పించాలని జిల్లా ఖజానా అధికారి వి.లక్ష్మీ సుభాషిణి ఒక ప్రకటనలో తెలిపారు. జీవన, నాన్-ఎంప్లాయ్‌మెంట్ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ పింఛనుదారులు జీవన ధ్రువీకరణ నాన్- ఎంప్లాయిమెంట్‌లతో పాటు నాన్- రీమ్యారేజ్ ధ్రువీకరణ పత్రాలు కూడా జత చేయాలన్నారు. ధ్రువీకరణ పత్రాలు ఉప ఖజానాలు, మీసేవ కేంద్రాలు, ఇంటర్నెట్ కేంద్రాలు ద్వారా అందజేయ వలసిందిగా కోరారు. సకాలంలో అందజేయనట్లయితే ఏప్రిల్ నెల పింఛను నిలిపివేయబడుతుందని తెలిపారు.

నేడు గొలగాం, గోపాలపురం గ్రామాల్లో వికసిత్ భారత్

అనకాపల్లి : మండలంలో వికసిత్ భారత్ కార్యక్రమం శనివారం ఉదయం 9 గంటలకు గొలగాం, మధ్యాహ్నం 3 గంటలకు గోపాలపురం గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.వి.నరసింహారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమ పథకాల గురించి వివరిస్తారని ఆయన తెలిపారు.